మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి

**వర్గల్, మార్చి 6 (ప్రభాతవార్త):**

చేపలు పట్టడానికి వెళ్ళి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం మీనాజీపేట గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మీనాజీపేట గ్రామానికి చెందిన బర్రాల కిష్టయ్య(53) అనే వ్యక్తి మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కూలీ పనులకు వెళ్ళాలని చెప్పి ఇంటి నుండి వెళ్ళాడు. కానీ అతను పనికి వెళ్ళకుండా మధ్యాహ్నం 2 గంటల సమయంలో చేపలు పట్టడానికి గ్రామ శివారులోని హమసోని కుంటకు వెళ్ళాడు. కుంటలో చేపలు పడుతున్న క్రమంలో అతని కాళ్ళకు చేపల వలలు చుట్టుకొని కుంటలో మునిగిపోయి మృతిచెందాడు. అతను రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. కాగా బుధవారం ఉదయం చెరువులో కిష్టయ్య మృతదేహం పైకి తేలింది. సమాచారం అందుకున్న గౌరారం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హుస్నాబాద్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాస్

సిపిని కలిసిన సిఐ శ్రీనివాస్

**హుస్నాబాద్, మార్చి 6,ప్రభాతవార్త :** హుస్నాబాద్ నూతన సిఐగా కె శ్రీనివాస్ బుధవారం రోజున బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన సిఐ ఎర్రల కిరణ్ సిద్దిపేట సిసిఎస్‌కు బదిలీపై వెళ్లడంతో సిద్దిపేట ఎసిబిలో విధులు నిర్వహించిన శ్రీనివాస్ బదిలీపై హుస్నాబాద్ కు వచ్చారు.బాధ్యతలు స్వీకరించిన సిఐ సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.కమిషనర్ అనురాధ మాట్లాడుతూ హుస్నాబాద్ సర్కిల్‌లో శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని,సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సిఐకి సూచించారు.

రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి

## రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి

**ఝరాసంగం, మార్చి 6, ప్రభాతవార్త:** దత్తగిరి మహారాజ్ 45వ వార్షిక అమరతిథిని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మనూర్ మండలంలోని బెల్లాపూర్ దత్తగిరి ఆశ్రమం నుంచి ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమం వరకు ప్రతి సంవత్సరం లాగే పాదయాత్ర పల్లకి సేవ (రథయాత్ర) కరపత్రాన్ని బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆవిష్కరించారు. బుధవారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో ఆశ్రమ పీఠాధిపతి అవదూత గిరి మహారాజ్‌తో కలిసి రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. రథయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల్లో విశ్వమానవ ఆధ్యాత్మిక సభలు, భజనలు, సంస్కృతిక కార్యనరకమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రథయాత్ర కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో విజయవంతం చేయాలని అవదూతగిరి మహారాజ్ సూచించారు.

## ముస్లాపూర్ బీరప్ప గుడి వద్ద మంత్రి సొంత నిధులతో బోరు ఏర్పాటు

బీరప్ప గుడి వద్ద బోరును వేస్తున్న దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి 6, ప్రభాతవార్త:** మండలంలోని ముస్లాపూర్ గ్రామంలోని బీరప్ప స్వామ గుడి వద్ద వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా తన సొంత నిధులతో భక్తుల సౌకర్యార్థం బోరును డ్రిల్ చేయించారు. ఎన్నికల సందర్భంగా గొల్లకురుమ సంఘం వారికి చేసిన హామిమేరకు మంత్రి దామోదర్ రాజనర్సింహా బుధవారం బోరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఆలయానికి వచ్చే భక్తులు తాగునీటి కోసం అవస్థలు పడుతుండటంతో భక్తుల వినతి మేరకు బోరును డ్రిల్ చేయించి సింగల్ ఫేజ్ మోటారును ఏర్పాటు చేశారరు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేసారెడ్డి, ముస్లాపూర్ గ్రామ అధ్యక్షులు సురేష్ సేట్, గ్రామ యూత్ అధ్యక్షులు వెంకట్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు న్యాయ అవగాహన

**-సదస్సును ప్రారంభించిన జిల్లా న్యాయమూర్తి**

న్యాయ అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రావు

**సంగారెడ్డి టౌన్, మార్చి 6, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలక న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సును జిల్లా న్యాయమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు గృహహింస, ఫోస్కో, సైబర్ చట్టాలపై అవగాహన కల్గి ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. ఎలాంటి న్యాయ సలహాలకైన న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి సుదర్శన్, పి కృష్ణార్జున, జి సునీత రవీందర్‌రెడ్డి, యం లావణ్య, రాధకృష్ణ చౌహాన్, పి లక్ష్మణచారీ, శాలిని సకెల్లి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రాంగణంలోని మహిళా అధికారులు, మహిళ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయం పెరిగే వనరులపై దృష్టిపెట్టాలి

**అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్**

**జోగిపేట, మార్చి 6, ప్రభాతవార్త:** మున్సిపల్ ఆదాయం పెంచుకునేందుకు అవసరమైన ఆదాయ వనరులపై దృష్టిసారించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారంనాడు జోగిపేట మున్సిపల్ కార్యాలలయంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తిపన్నును వందశాతం వసూలుచేయాలని, అలాగే మిగతా ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ ఆదాయానిన రూ.51.07కోట్లు, వ్యయం 50.88 కోట్లుగా, మిగులు రూ.6.66లక్షలుగా అంచనావేశారు. కార్యక్రమంలో ఛైర్మెన్ మల్లయ్య, కమీషనర్ తిరుపతి, కౌన్సిలర్లు రంగ సురేష్, సురెందర్‌గౌడ్, కోరబోయిన నాగరాజు(నాని), హరిక్రిష్ణగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

## ‘ఆధునిక సాంకేతిక’ను సద్వినియోగం చేసుకోవాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, మార్చి 6 ప్రభాతవార్త:** ఆధునిక సాంకేతిక విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం రాష్ట్రంలోని రైతు వేదికల్లో ‘రైతు నేస్తం’ కార్యక్రమాన్ని హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం పేరిట రైతు వేదికలకు వీడియోకాన్ఫరెన్సింగ్ అనుసంధాన కార్యక్రమంలో భాగంగా కొల్చారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదర్శ రైతు మహిపాల్‌రెడ్డి, ఏడీ అగ్రికల్చర్ గోవింద్, ఎంపీపీ మంజుల, ఏడీఏ పుణ్యవతిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అత్యుతమ్మ సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు అందించడం కోసం రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ పథకంద్వారా రైతులకు సీజనల్‌వారీగా ఎప్పుడు ఏ పంటలు వేయాలి, ఏ ఎరువు వేయాలి, భూమి సాంద్రత పంటలకు సంబంధించిన పూర్తివివరాలు తెలుసుకోవచ్చన్నారు. 26 రకాల పంటలకు వానాకాలం, రబీ సీజన్లలో ఏ పంటలు వేయాలి అనే అంశం తెలుసుకోవచ్చని తెలిపారు. పంటల బీమా సౌకర్యం కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం గ్రామ అధిక దిగుబడులు సాధించినట టీమాటా రైతు మహిపాల్‌రెడ్డి మట్లాడుతూ జిల్లాలో రైతు వేదికలు ఏర్పాటు చేసి రైతులందరికీ వ్యవసాయానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞాణాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సలహాలు, సూచనలు అందించడం శుభపరిణామమని అన్నారు. ఎనిమిది ఎకరాల టమాటా సాగు చేసి రెండు కోట్ల రూపాయల ఆర్థిక లాభం చేకూరిందని, నేను మొత్తం వంద ఎకరాల్లో పంటలు పండిస్తానని, నలభై ఎకరాల్లో కూరగాయల సాగు, అరవై ఎకరాల్లో వరి పంట పండిస్తున్నానని, నాకు సొంతంగా ఇరవై ఎకరాల భూమి కలదని, తెలంగాణలో ఏప్రిల్ మాసంలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా టమాటా పంటను రైతులు సాగు చేయరని, మదనపల్లి, కోదాడ నుంచి టమాటా దిగుబడి వస్తుందని, ఆ కాలానికి అనుగుణంగా టమాట సాగుచేసి దిగుబడులు ఆర్జించాలని, కాలానికి అనుగుణంగా టమాటా పంట పండించి అధిక దిగుబడులు సాధిస్తున్నారని చెప్పారు. తెలంగాణలో మరికొంత మంది రైతులను ఇటువంటి లాభసాటి వ్యవసాయంపై మళ్ళించినట్లయితే ఆదర్శ రైతులుగా తీర్చిదిద్దవచ్చని, ఆర్థిక పురోగతి సాధించవచ్చని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజులకాశీనాథ్, ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారులు శ్వేతకుమారి, బాల్‌రెడ్డి, తహశీల్దార్ మహమ్మద్ గఫార్ మియా, ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింలు, మండల వ్యవసాయ విస్త రణ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, నాయకులు, రైతు మహిపాల్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్‌రాజ్

## మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ రాజ్

**మెదక్ అర్బన్, మార్చి 6 ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ మెదక్ జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వంచే నియమించబడిన రాహుల్ రాజ్ బుధవారం మెదక్ జిల్లా ఐడీవోసీ కార్యాలయంలో సీటీసీ పై సంతకాలు చేసి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, ఆర్డీవో రమాదేవి, కలెక్టర్ కార్యాలయ ఏవో ఎండి. యూనిఫ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ నర్సింలు, ఏడీ మైన్స్ జయరాజ్, ఇతర శాఖల అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి, ప్రజాపాలన కార్యక్రమ అమలు తీరు, ధరణి, జిల్లాలో త్రాగునీటి సమస్య, ఏడు పాయల జాతర నిర్వహణ విధానం, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, విద్య, భూ సేకరణ, ప్రజావాణి కార్యక్రమం తదితర అంశాలపై చర్చించారు.

### మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానపత్రిక అందజేత

**అమీన్‌పూర్, మార్చి6 ప్రభాతవార్త:** బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుండి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించే మహా శివరాత్రి మహోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

## తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడవద్దు

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**సిద్ధిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

ఎండా కాలంలో జిల్లాలో మారుమూలన ఉన్న గ్రామాలలో సైతం ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడవద్దని జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా సమీకృత భవన సముదాయంలోని సమావేశ మందిరంలో డిఎల్‌పివో,ఎంపిడివొ,ఎంపివో,మిషన్ భరీరథ ఈఈ,డిఈ,ఏఈ అధికారులతో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలం, ప్రతీ గ్రామంలో తాగునీటి కొరత,వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు.ప్రతీ గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడే గ్రామాలను ముందుగానే గురినతంచాలన్నారు.ఈ నెల 7నుండి (నేటినుండి)15వ తేదీవరకు మిషన్ భగీరథపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ డ్రైవ్‌లో అన్ని గ్రామాలతో పాటు మండలాలు,మున్సిపాలిటీలలో ఎక్కడెక్కడ తాగునీటి కొరత ఉందో తెలుసుకోవడంతో పాటు పైప్‌లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంకుల మరమ్మత్తులను వెంటనే చేయించాలన్నారు.అనంరతం పిఎం విశ్వకరమన పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల గ్రామ పంచాయతీలలోనే వెరిఫికేషన్ పూరినత చేయాలని,ఎన్ఆర్ఈజిఎస్ పనుల్లో కొన్ని మండలాల్లో కూలీల కొరత ఉన్నందున జిల్లా యావరేజ్ తగ్గకుండా చూసుకోవాలన్నారు.జిల్లా ప్రజా పాలన సేవా కేంద్రాలలో గృహజ్యోతి,మహాలక్ష్మిపథకాలను అర్హులైన అభ్యర్థులు వారి సమస్యలను విన్నవించుకోవడం కోసం అవకాశం కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు వచ్చిన ధరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలన్నారు.టెక్నికల్ సమస్యలు ఉంటే ఉన్నత అధికరుల దృస్టికి తీసుకెల్లాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ జయదేవ్‌ఆర్య,జడ్పిసిఈవో రమేష్,డిపిఓ దేవకీదేవి,మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాస్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

## పూరి గుడిసె దగ్ధం

**-2 లక్షల రూపాయల ఆస్తి నష్టం**

**కొల్చారం, మార్చి6 ప్రభాతవార్త:** ప్రమాదశాత్తు నివాస పూరి గుడిసె దగ్ధమై సుమారు 2 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఈ సంఘటన బుధవారం తెల్లవారు జామున కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం పరిధిలోని జలాబాయి తండాలో చోటుచేసుకుంది. ప్రమాదంలో పూరి గుడిసె దగ్ధమై ప్రక్కనే ఉన్న స్లాబ్ ఇల్లుకు మంటలు అంటుకొని స్లాబ్ ఇల్లు పూర్తిగా బీటలు వారింది. బాధితులు గుగులోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ సుమారు 2 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రమాదంలో 30 తులాల వెండి, నగదు, బియ్యం, వంట సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. ఘటన స్థలానికి రెవెన్యూ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సాయిలు వెళ్లి పంచనామా నిర్వహించి, పంచనామా నివేదికను తహశీల్దార్‌కు అందజేశారు.

## వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి పెరుగుతున్న ఆశావహులు

**ఒక్కొక్కరుగా తెరపైకి వస్తున్న నాయకులు**

**ములుగు, మార్చి 6 (ప్రభాతవార్త):**

ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి ఎస్సీ మహిళ రిజర్వు కావడంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకులు, పదవి కోసం ఆశావాహులు ఒక్కొక్కరుగా తెరపైకి వస్తున్నారు. వర్గల్ మాజీ ఎంపిపి మోహన్, ములుగు మండలకేంద్రానికి చెందిన చింతకింది ఇందిర ఎల్లం, చింతకింది రాజు, ఎడ్ల పోచయ్య వీరి కుటుంబాలలో ఏఎంసి పదవి మాకు కావాలంటే మాకు కావాలి అని పోటీ పడుతూ మంత్రుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొండ పోచమ్మ భూనిర్వాసితుడు మామిడ్యాల గ్రామానికి చెందిన ఎడ్ల పోచయ్య గత ప్రభుత్వ హయాంలో కొండపోచమ్మ సాగర్ భూ సేకరణలో ప్రభుత్వం ఎకరానికి రూ.12 లక్షల చొప్పున ఇస్తూ అమాయక రైతులను మోసం చేసిందని, గ్రామ రైతులందరికీ భూమికి భూమి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్ష హోదాలో ఉన్నప్పుడు పార్టీ తరపున ప్రభుత్వంపై కోర్టుకు వెళ్ళిన గ్రామస్తులు ఎలాంటి లబ్ధి పొందకుండా సుమారు 50 ఎకరాల భూమికి నయా పైసా తీసుకోకుండా త్రీవ్రంగా నష్టపోయారు. కోర్టుకు వెళ్ళిన వారి కుటుంబాలకు కనీసం ఉండటానికి ఇల్లు కూడా ఇవ్వకుండా చిన్న రేకుల రూము కేటాయించి అప్పటి అధికార బిఆర్ఎస్ పార్టీ దౌర్జన్యంగా 500 మంది పోలీసుల పహారాతో వారి కళ్ళ ముందే ఇండ్లను కూల్చేసి గ్రామం నుండి బలవంతంగా ఖాళీ చేయించింది. బిఆర్ఎస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు మేము బలయ్యామంటూ ఎడ్ల పోచయ్య ఆవేదన వ్యక్తం చేశారు.మాకు జరిగిన అన్యాయం మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నర్సా రెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందరికీ తెలుసని అన్నారు. ఇప్పటికైనా మా త్యాగాన్ని గుర్తించి పార్టీ కోసం ప్రాణాలను సైతం అర్పించే మాపై దయతలచి వంటిమామిడి మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి విద్యావంతురాలైన మా కోడలు ఎడ్ల మమతకు కేటాయించి ఆదుకున్నట్లయితే ప్రభుత్వ సహాయ సహకారాలతో నాయకుల అండదండలతో మార్కెట్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని ఆయన మంత్రులను, పార్టీ నాయకులను కోరుతున్నారు. ఏది ఏమైనా పార్టీ అధిష్టానం వంటిమామిడి ఏఎంసి పదవి ఎవరికి కేటాయిస్తుందో వేచిచూడాల్సిందే...

వంటిమామిడి కూరగాయల మార్కెట్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

## బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

**-ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**

**సిర్గాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సిర్గాపూర్‌లోని రైతువేదికలో బుధవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రివ్యూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి మాట్లాడుతూ పేదలకు గృహలక్ష్మి, ఉచిత కరెంటు, రైతు రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీలో 10 లక్షల వరకు బీమా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా చేసిన 6 గ్యారంటీల హామీలను అమలు చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడి నూతన కుమార్, ఆర్టికల్చర్ అధికారి సమత, ఎంపిటిసి సభ్యులు పీరప్ప, మాజీ సర్పంచ్ స్వప్న శంకరయ్యస్వామి, మండల పార్టీ అధ్యక్షులు మనిష్ పాటిల్, మహేశ్వర్ సేట్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రావ్, జైరాజ్, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### సిద్దేశ్వరదేవస్థానం ఆలయ చైర్మన్‌గా దారం వెంకన్నసేట్

మాట్లాడుతున్న డీసీసీబీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

**కంగ్టి, మార్చి 6ప్రభాతవార్త:** శ్రీసిద్దేశ్వర దేవస్థానం ఆలయం నూతన చైర్మన్‌గా దారం వెంకన్నసేట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. డైరెక్టర్లుగా గాజులే చెన్నబసప్ప, కుర్తే భూమారెడ్డి, శ్రీమతి మూలే గుండమ్మ, శ్రీఅస్తూర్ హ్యాన్మంతు, మాములోల పవన్‌కుమార్ గౌడ్, పూజారి జైమారాజ్, బర్దాపూర్ అంజన్నలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సర్దార్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు నేస్తం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

**జహీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** మండలంలోని హుగ్గెల్లి రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, వ్యవసాయ అధికారులు పాల్గొని రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులపపై అవగాహన కల్పించారు. ఉగాది పర్వదినం వరకు రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వార రైతులకు శాస్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు అందచేస్తారని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న వానకాలం 2024 నుంచి పంటల బీమా పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వసంత కుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు భిక్షపతి, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, అధికారులు, 150 మంది రైతులు పాల్గొన్నారు.

### ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వర స్వామి ఆలయం

**చిన్నశంకరంపేట, మార్చి 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రుద్రారం గ్రామంలోగల శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయ 75వ వార్షికోత్సవ ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటి తెలిపింది.శుక్రవారం నుండి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు బుధవారం తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సుప్రభాతం, గణపతి పూజ, అఖండి దీపారాధన, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, బిల్వ పూజ, బిల్వ యాత్ర, మహానీరాజనం,ఆశీర్వచనంనందివాహన సేవ, శనివారం నాడు సుప్రభాతం, త్రికాలార్చన, జలపందిరి, నరేష్‌యాదవ్ బృందంచే ఒగ్గుకథ, ఆదివారం సుప్రభాతం, త్రికాలార్చన, బండి శిడి, బండ్లు తిరుగుట, పల్లపు స్వామి బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు,సోమవారం నాడు సుప్రభాతం, త్రికాలర్చన,శ్రీకామేశ్వరీ సంగమేశ్వరస్వామి కళ్యాణం, బండిశిడి, బండ్లు తిరుగుట, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి శ్రీ సంగమేశ్వర స్వామి భజన మండలి వారిచే యక్షగానము నిర్వహణ,మంగళవారం సుప్రభాతం, నిత్యపూజ, తెల్లవారు జామున రంగురంగుల దీపాలంకరణ, రథోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గోనాలని ఆలయ కమిటి కోరింది. సుప్ర సిద్దమైన శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం కోరిన కోర్కెలు తిరుతాయనే నమ్మకంతో మండల పరిధిలోని చందంపేట,చిన్నశంకరంపేట, అంబాజీపేట, గవ్వలపల్లి, జంగారాయి, సురారం, చందాపూర్, మిర్జాపల్లి తదితర గ్రామాల నుండి భక్తులు హాజరై స్వామి వారికి మొక్కులను చెల్లించుకుంటారు.

రుద్రారంలో ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వర ఆలయం

## వర్గీకరణకు చట్టబద్ధత కోసం ఎఐసిసి, సిఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలి

సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త: మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కోసం ఎఐసిసి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజుమాదిగ, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాంమాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సిఎం ఇచ్చిన హామీ ప్రకారం దళితులకు 12 లక్షల రూపాయలు డా.బి.ఆర్.అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రెండు సీట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో కందుల సాయినాథ్, కోట్టె పద్మయ్య, సిలివేరు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులందరిని ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలి

సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త: రాష్ట్ర హైకోర్టులో గత సంవత్సర కాలంగా ప్రభుత్వ న్యాయవాదులుగా, సహాయ న్యాయవాదులుగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌గా పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులందరిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి డిమాండ్ చేసింది. లేని పక్షంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజుమాదిగ హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హైకోర్టులో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ న్యాయవాదులుగా పనిచేసుకోవడానికి అవకాశం కల్పించలేదని, గత 9 సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. మాదిగలను అడిషనల్ పిపిగా, అసిస్టెంట్ పిపిగా, జిపిగా, ఎజిపిగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మవాంకాళీ కొత్త ఎసిపికి స్వాగతం, పాత ఎసిపీకి వీడ్కోలు

,బదిలీ అయిన మవాంకాళీ ఎసిపి రవీందర్‌ను సత్కరిస్తున్న నూతన ఎసిపి సర్దార్‌సింగ్ పోలీసులు

బేగంపేట మార్చి 6,ప్రభాతవార్త : మవాంకాళీ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించి తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీకి బదిలీపై వెళుతున్న ఏసీపీ రవీందర్ కు పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.సీఐడీ నుంచి మవాంకాళీ డివిజన్‌కు నూతన ఏసీపీ గా వచ్చిన సర్దార్ సింగ్‌కు పోలీసులు స్వాగతం పలికారు. బుధవారం సీఐడీ నుంచి మవాంకాళీ డివిజన్ ఏసీపీ గా వచ్చిన సర్దార్ సింగ్‌కు గతంలో ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రవీందర్ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా పలువురు పోలీసులు అధికారులు,సిబ్బంది బదిలీపై వెళుతున్న ఏసీపీ రవీందర్‌కు పూలు చల్లుతూ బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు పలికారు.కొందరైతే ఆయన బదిలీపై వెళుతుండటంతో కంటతడి పెట్టారు. ఈ కార్యక్రమంలో మవాంకాళీ ఇన్స్ పెక్టర్ పరుశరాంతో పాటు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తాం

### సమాచార, రెవెన్యూ, హౌసింగ్‌శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హెచ్‌యూజే డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త: అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలో ఇండ్ల స్థలాలు ఇస్తామని సమాచార, రెవెన్యూ, హౌసింగ్‌శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన కార్యాలయంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే నాయకులు జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల ప్రధాన సమస్య అయిన ఇండ్ల స్థలాల అంశం త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సీనియారిటీని బట్టి కేటగిరీలుగా విభజించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలం అందేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ పాల్గొన్నార

## లక్ష్మర్ జిల్లా ఏర్పాటు చేయాలి

సికింద్రాబాద్, మార్చి 6 ప్రభాతవార్తఃలక్ష్మర్ జిల్లా ఏర్పాటును కోరుతూ లక్ష్మర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లక్ష్మర్ జిల్లా ఏర్పాటు కొరకు తనవంతుగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వడ్డెర కార్మికులకు అండదండగా వడ్డెర సంక్షేమ సంఘం

### రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య

మృతిచెందిన వడ్డెర సంఘకార్మికుడు బొంత లింగయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, పిల్ల మల్లేష్, సంఘ నాయకులు

కుత్బుల్లాపూర్, మార్చి 6 ప్రభాతవార్త: తెలంగాణలోని ఏ ఒక్క వడ్డెర కార్మికుడి కుటుంబానికి ఇబ్బందులు ఎదురైనా వడ్డెర సంక్షేమ సంఘం పూర్తి సహాయ, సహకారాలను అందిస్తుందని తెలంగాణ వడ్డెర సంక్షేమరాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య హామీఇచ్చారు. కార్వాన్‌కు చెందిన బొంత లింగయ్య గత 28న మరణించగా వారి కుటుంబానికి బాసటగా రూ.లు.10,000ఆర్థిక సహాయం సంఘ రాష్ట్ర నాయకులు పిట్ల మల్లేష్, యువజన నాయకులు కొమ్మరాజుల శేఖర్, శివరాత్రి వెంకటేశ్, దండుగుల మహేశ్, ఇరగదింట్ల రమేశ్, కార్వాన్ వడ్డెర సంఘ నాయకులు పి.చంద్రమౌళి, వి.వెంకటేశ్, రాజు, బి.శ్రీనుల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా ఎత్తరి మారయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించి విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేకప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

## బస్తీ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తా

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బస్తీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త: ముషీరాబాద్ డివిజన్‌లోని బృందావన్ బస్తీ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం అధికారులతో కలసి బస్తీ సమస్యలపై ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులతో సమస్యలపై చర్చించారు. అనంతరం బృందావన్ బస్తీ అధ్యక్షునిగా ఎన్నికైన నాగులు యాదవ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు శివముదిరాజ్, గోరఖ్‌నాథ్, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్, డిఈ గీత, వాటర్ వర్క్స్ మేనేజర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

## చట్టసభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలి

### ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

మహిళలను సత్కరిస్తున్న సిరికొండ మధుసూదనాచారి, కళావిఎస్.జనార్దనమూర్తి

చిక్కడపల్లి, మార్చి 6 ప్రభాతవార్త: చట్టసభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భిన్న రంగాలకు చెందిన ప్రముఖ మహిళలు కొమ్ముజోసుల లలిత, సూరంపూడి శ్రీమణి, తాళ్ళపల్లి శోభారాణిలను సత్కరించి అభినందించారు. మహిళలు అన్ని రంగాలలో తమప్రతిభ కనపరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యురాలు భమిడి ఉషా తదితరులు పాల్గొన్నారు.

## 8న వీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప సాయిబాబ దేవస్థానంలో ప్రత్యేక పూజలు

యూసుఫ్‌గూడ, మార్చి 6, ప్రభాతవార్త : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేది శుక్రవారం వెంగళ్‌రావునగర్ జీటీఎస్ కాలనీ శ్రీ వీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప సాయిబాబ దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.శుక్రవారం ఉదయమే అభిషేకము, ఉదయం 9 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 8 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం రాత్రి 10 గంటలకు అభిషేకం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ చైర్మన్ చిన్నరమేష్, కార్యనిర్వాహణ అధికారి జయ రామయ్య తెలిపారు.

**స్వరాజ్‌నగర్‌లో..** బోరబండ స్వరాజ్‌నగర్‌లో శ్రీ హరిహర క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలవల సత్య నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఉదయమే అభిషేకము, రాత్రి 10.30 గంటలకు శివపార్వతుల కళ్యాణం, రాత్రి 12 గంటలకు మన్యాస పూర్వక రుద్రాభిషేకం జరపడుతుందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్, మజ్లిస్‌ల మధ్య ఎటువంటి ఒప్పందం లేదు

### పులిపాటి రాహుల్

చార్మినార్, మార్చి 6 ప్రభాతవార్త : కాంగ్రెస్,మజ్లిస్ పార్టీలపై సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాహుల్ ఖండించారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నెల 5వ తేదీ సాయంత్రం పాతబస్తీ అరుంధతీనగర్‌లో అంగన్‌వాడి కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తాను నిర్మిస్తున్న ఒవైసీ స్కూల్‌కు తీసుకెళ్లి అక్కడ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లటం జరిగిందని తెలిపారు.ఈవిషయంలో సోషల్ మీడియోలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీనిని ఖండిస్తున్నామని ఆయన తెలియజేశారు.ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎటువంటి ఒప్పందం లేదని,సోషల్ మీడియోలో తప్పుడు ప్రచారం చేస్తే చట్ట పరమైన కేసులు పెడతామని రాహుల్ తెలిపారు.

## అవినీతి నిర్మూలన ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

అఫ్జల్‌గంజ్, మార్చి 6 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాలల్లో సామాన్య ఫౌరులకు సమస్యలను పరిష్కరించేందుకు గాను డబ్బులు అడుగుతున్నారని తెలంగాణ అవినీతి నిర్మూలన ఫౌండేషన్ అధ్యక్షులుగా నియమితులైన ఎన్.ఆర్‌లక్ష్మన్‌రావుగుప్త ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూస్తానన్నారు.ది అవినీతి నిర్మూలన జాతీయ ఫౌండేషన్ నియమించినట్లు చెప్పారు.

## జీవ శాస్త్ర పరిశోధనలతో ఎంతో ఉపయోగం ఉంది

### ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్

మైక్రోబయాలజీ జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీరును ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్, ప్రొఫెసర్లు భీమా, చాండ్‌పాషా

సైఫాబాద్, మార్చి 6 ప్రభాతవార్త: జీవ శాస్త్ర రంగాల్లో పరిశోధనలు చేస్తూ నూతన ఆవిష్కరణలు చేయడం వల్ల విద్యా, ఉపాధి రంగాల్లోనే అవకాశాలు కాకుండా సమాజ వికాసానికి ఎంతో ఉపయోగం లభిస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ చెప్పారు. మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిజాం కళాశాలలో 'ఇన్నోవేషన్స్ ఇన్ మైక్రోబియల్ బయోటెక్నాలజీ:పయనీరింగ్ ది ఫ్యూచర్' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.భీమా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ప్రపంచ పోటిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులే కాకుండా అధ్యాపకులు కూడా ఎప్పటికప్పుడు నూతనంగా ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు-ఆధ్యాపకుల పరిశోధనలు కొనసాగించాలని సూచించారు. ఈ సదస్సులో కన్వీనర్ ప్రొఫెసర్ చాండ్‌పాషా, ప్రొఫెసర్ బుర్రి రంగారెడ్డి, ఎల్.వెంకటేశ్వర్‌రావు, ప్రొఫెసర్ గీతా శర్మ, డా.అంజురాజు, డా.దరావత్ సాంబశివరావు పాల్గొన్నారు.

## వివాదానికి దారితీసిన ఆందోళన

### ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు డిసి కనీస మర్యాద ఇవ్వరా..?

ధర్నాలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్, మార్చి 6 ప్రభాతవార్త: ఎల్ఆర్ఎస్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా చేయాలనే డిమాండ్‌తో బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆందోళన అల్వాల్‌లో ఎమ్మెల్యే వర్సస్ డిసిగా మారింది. బుధవారం ఉదయం సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన కోసం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటుగా ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనీల్ కిషోర్‌లుతో పాటుగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ధర్నా జరుగుతున్న సమయంలోనే డిసి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయం ప్రధాన గేటు వద్దకు కారులో రావడం జరిగింది. కారు లోపలికి వెళ్ళే అవకాశం లేక పోవడంతో పక్కకు జరగాలని బిఆర్ఎస్ నేతలను ఆయన కోరారు. కారు దిగి వినతి పత్రం స్వీకరించాలని కార్యకర్తలు కోరినా డిసి పట్టించుకోలేదు. నలభై నిమిషాలు పాటు ఆయన అలాగే కారులోనే కూర్చుని ఉన్నారు. ఎమ్మెల్యేతో పాటుగా కార్పొరేటర్లు ఉన్నా కనీస మర్యాద డిసి ఇవ్వలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదం ముదిరి పాకాన పడుతున్న నేపథ్యంలో అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కల్పించుకుని ఇరు వర్గాలను సముదాయించారు.

**ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాల్సిందే: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఎన్నికలులో ఉచితంగా ఎల్ఆర్ఎస్‌లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని మరువరాదన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆరు గ్యారెంటీలులో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి

కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి కార్యదర్శి అల్లం భాస్కర్, యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి రవి రాజ్

చార్మినార్,మార్చి 6 ప్రభాతవార్త : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని టిపిసిసి కార్యదర్శి అల్లం భాస్కర్,యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజ్‌లు అన్నారు.యాకుత్‌పుర నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలకు వారు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శులు మామిడి కృష్ణ కుమార్,కోట్ల శ్రీనివాస్,గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు రాజు యాదవ్,కాంగ్రెస్ నాయకులు కోట్ల లడ్డు,శశి యాదవ్,నళిని గౌడ్, మల్లిఖార్జున్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చార్మినార్, మార్చి 6 ప్రభాతవార్త : పాతబస్తీ ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం జరిగింది.ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ ఎస్ఐ హసీనా,డాక్లర్లు రుబీనా,అమీనా,మీర్జా హైమద్ అలీ బేగ్‌లు పాల్గొని మహిళా ఉద్యోగులను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హసీనా మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలోను పాల్గొంటున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఫలక్‌నుమా ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, ఎటిఎం,ఎఈఎం, ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సకల కళల సమ్మిళితం సమ్మేళనం హరికథ

### సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు

కళాకృష్ణ, ఉమామహేశ్వరి దంపతులకు అక్కినేని లలితకళా పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు

రవీంద్రభారతి, మార్చి 6 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ డాక్టరేట్ గ్రహీత, కేంద్ర ప్రభుత్వం చే పద్మశ్రీ పురస్కారం పొందిన దంపతులు నాట్యాచార్యుడు కళాకృష్ణ, హరికథా భాగవతారిణి ఉమామహేశ్వరిలాంటి మహోన్నత కళాకారులు మన తెలుగువారు కావడం తెలుగుజాతి అదృష్టమని, అక్కినేని శతజయంతి వేడుకల్లో భాగంగా వీరికి అక్కినేని లలితకళా పురస్కారం ప్రదానం చేయడం ఎంతో సబబుగా ఉందని సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఏపి పాఠశాల విద్యానియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ ఆశీస్సులతో, యువకళావాహిని ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో భాగంగా రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన అక్కినేని లలితకళా పురస్కార ప్రదానోత్సవానికి హాజరయ్యారు.

## సుబ్రమణ్య స్వామి దేవాలయంలో మహా శివరాత్రి

### ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు సంతోష్ యాదవ్,చొల్లేటి రమేశ్ తదితరులు

కంటోన్మెంట్,మార్చి 6 ప్రభాతవార్త: కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీసుబ్రమణ్య స్వామి దేవాలయంలో ఈ నెల 7,8 తేదీల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్, ఆలయ ఈఓ అరుణ కుమారి, ట్రస్ట్ బోర్డు మెంబర్ చొల్లేటి రమేశ్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గురువారం రుద్రహోమం, శివకళ్యాణం, ఈ నెల 8న మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం, సంతత దారాభిషేకం, అర్చనలు, అష్టోత్తర 105 కళశాలతో అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు వేణుగోపాల్, భాస్కర్, గుజ నాగేందర్ యాదవ్, నర్సింగ్‌రావ్, పద్మజా, ప్రధాన అర్చకులు టీ.రాజేశ్వర శర్మ తదితరుల పాల్గొన్నారు. ఈ మహా శివరాత్రి వేడుకలకు మలా ఖ్జగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వెన్నెల గద్దర్‌లు ముఖ్య అతిధిగా విచ్చేయనున్నట్లు వారు తెలిపారు.

## సుల్తాన్‌బజార్ పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.శ్రీనివాస్‌చారి

బేగంబజార్, మార్చి 6 ప్రభాతవార్త: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.శ్రీనివాస్ చారి నియమితులయ్యారు. ఇటివల కమీషనరేట్ పరిధిలో జరిగిన ఇన్‌స్పెక్టర్ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కొత్తపల్లి ముత్తు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసాచారి భాద్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న శాంతి భద్రతల పరి రక్షణకు తనవంతు కృషి చేస్తామన్నారు.

## కులాలకు సమ ప్రాధ్యానత కల్పించాలి

మవాంకాళీ అమ్మవారి చిత్రపటాన్ని అందచేస్తున్న ప్రజా ఏక్తాపార్టీ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త,నరేష్

బేగంబజార్, మార్చి 6 ప్రభాతవార్త: అన్ని మతాలను,కులాలకు సమ ప్రాధ్యానత కల్పించవల్సిన భాద్యత పాలకులపై ఎంతైనా ఉందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ గుప్త అన్నారు. గౌలిగూడ అమ్మవారి దేవాలయంలో ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్త చేతుల మీదుగా ప్రజాఏక్తాపార్టీ నాయకులు దూత్‌పాల నరేష్ అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి భక్తుడు నరేష్ డిజిటల్ లైట్లతో రూపొందించిన చిత్రపటాన్ని అందచేశారు. ఈకార్యక్రమంలో సురేష్‌గౌడ్,రాజు,అర్షద్ పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో 14 అంశాలకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి..**

ఎంవోయూ చేసేందుకు కమిషనర్‌కు అనుమతిస్తూ అమోదం తెలిపింది • ముసారంబాగ్ మూసి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అలీకేఫ్, అంబర్‌పేట్ అలీకేఫ్ ,అంబర్‌పేట్ నఉంచి ముసారాంబాగ్ స్పైస్ రెస్టారెంట్ వరకు ,అలీకేఫ్ ఎక్స్ రోడ్‌నుంచి అంబర్‌పేట్ బ్రిడ్జి అజామాబాద్ డివిజన్‌కు యుటిలిటీల షిఫ్టింగ్ కోసం అంచనా వ్యయం మొత్తం రూ. 3,97,32,391 లకు పరిపాలన అనుమతికి సిఫారసు చేస్తూ కమిటీ అమోదం తెలిపింది • ఛీఫ్ ఎగ్జామినర్ అఫ్ అకౌంట్స్ ద్వారా 31 ఆగస్టు 2023 నుంచి 40నవంబర్ 2023వరకు జిహెచ్ఎంసికి సంబంధించిన ఆదాయ, వ్యయ నివేదికను కమిటీ ముందు ఉంచారు •ఎల్బీనగర్ సర్కిల్ బైరామల్ గూడ చెరువు నుంచి సరూర్‌నగర్ చెరువుకు వరకు వర్షను నీటికాలువ నిర్మాణానికి రివైజ్డ్ అంచనా మేరకు (రూ.588లక్షల) అదనంగా రూ.10.52లక్షల మొత్తం 598లక్షల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది • జిహెచ్ఎంసి పారిశుద్ధ్యం, అడ్వర్టైజ్‌మెంట్‌పై రెండు అడ

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సోమేశ్వర ఆలయం

## శ్రీసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**చిన్నశంకరంపేట, మార్చి 6,ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో వెలసిన శ్రీసోమేశ్వరస్వామి 53వ వార్షికోత్సవ ఉత్సవాలు మహ శివరాత్రి సందర్భంగా ఈ నెల 8 శుక్రవారం నుండి సోమవారం 11వ తేదీవరకు జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి బుధవారం తెలిపింది. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో అతి పెద్ద జాతర ఉత్సవాలు దేవాలయ కమిటి ఏటేటా ఈ ఉత్సవ జాతరను ఘనంగా నిర్వహిస్తుంది. ఈ సోమేశ్వర స్వామి ఆలయం రంగు రంగులతో అలంకరించి విద్యుత్ దీపాల అలంకరణ తో ముచ్చెట గోలిపే విధంగా జాతర ఉత్సవాలకు ముస్తాబయింది. ఈ ఉత్సవాలకు మండలంలోని గజగట్లపల్లి, శాలిపేట, చెన్నాయిపల్లి, మడూర్, గవ్వలపల్లి, అంబాజిపేట, కోండాపూర్, మందాపూర్, ఖాజాపూర్, మిర్జాపల్లి తదితర గ్రామాల నుండి భక్తులు అధికసంఖ్యలో హాజరై మొక్కులను చెల్లించుకుంటారు. ఈ జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులు మెదక్, చేగుంట హైదరాబాద్ వెళ్ళే మార్గంలో చిన్నశంకరంపేట గ్రామంలో దిగవలసి ఉంది. సోమేశ్వరస్వామి ధర్శనార్థం భక్తులు గమనించాలని ఆలయ కమిటి తెలిపింది. ఈ నెల 8 శుక్రవారం మొదటిరోజు గణపతి, రుద్రహోమాలు, నాగులపూజ, స్వామివారి పల్లకీ సేవ, వీధినాటకం, 2వరోజు రుద్రాభిషేకం, మంగళహారతి, అర్చన, గుమ్మటాల ఊరేగింపు, హరికథ, భజనలు 3వ రోజు సహస్ర కుంకుమార్చన, భైరవ పూజ, గ్రామ దేవత, పోచమ్మ వారికి బోనాల సమర్పణ, అగ్ని గుండాలు, 4వ రోజు స్వామివారి కళ్యాణం, రావణదహనం, పుర వీదులలో విశేష శోభితంగా రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటి, పట్టణ తాజా మాజీ సర్పంచి రాజిరెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేసిశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటి కోరింది.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

**గజ్వేల్, మార్చి 6 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మదునాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పడుతూ విద్యనభ్యసించేవారు కానీ ఈరోజు స్వయంగా బోధించడం ఎలా అని నేర్చుకున్నట్లు తెలిపారు. ఇది వారికి మంచి అనుభూతి అన్నారు. డీఈఓగా ఈశ్వర్, ఎంఈఓగా ప్రదీప్తి, ఎంఎన్ఓగా శశాంక్, ప్రధానోపాధ్యాయురాలిగా సృజన, పీఈటీగా రామకృష్ణ, ఉపాధ్యాయులు అంజద్, మమత, రక్షిత, లాస్య, దీప్తిలు విధులు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమలత, వెంకటమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యంరెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నాయకులు



ముత్యంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**గజ్వేల్, మార్చి 6 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకు ఓఎస్డిగా మాజీ గడా అధికారి ముత్యంరెడ్డి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కల్యాణ్‌కార్ నర్సింగరావు, బాకి స్వామి, మల్లేశంగౌడ్, మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్ల వెంకటేష్ ఉన్నారు.

## దేవాలయం నూతన కార్యవర్గం

శంభు దేవాలయ నూతన కార్యవర్గం ఎన్నికైన దృశ్యం

**కొండపాక, మార్చి 6, ప్రభాతవార్త :** దుద్దెడ గ్రామ స్వయంభు శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్ట్ ఎన్నికలు బుధవారం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్‌గా మంచాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్దంకుల శ్రీనివాస్, కోశాధికారిగా వడ్డకొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అనంతుల నరేందర్, పబ్బోజు శ్రీనివాస్ చారి, సహాయ కార్యదర్శులుగా నర్రా దేశాయిరెడ్డి, నూనె కుమార్, పెద్ది కుమారస్వామి, సహాయ కోశాధికారిగా మంచాల చిన్న శ్రీనివాస్, సలహా దారులుగా మంచాల కృష్ణమూర్తి, గోనె శ్రీనివాస్, బూర్గుల వెంకట రమణ ఏన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ స్వర్గీయ మాజీ చైర్మన్ గొల్లపల్లి రామచంద్రమూర్తి శర్మ మార్గదర్శనంలో అలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. వచ్చే వార్షిక బ్రహోతసవాలకు బేకు కర్రతో రథం చేయించడానికి కార్యవర్గం తొలి తీర్మానం చేశారు. ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని పునరుద్దరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అరెపల్లి మమదేవ్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం రెండు సంవత్సరాలపాటు పని చేస్తుందని వివరించారు. ట్రస్ట్ కార్యవర్గం గౌరవ అధ్యక్షులుగా పెద్ది నర్సయ్య వ్యవహరించి ఎన్నికలను నిర్వహించారు.

## అశోక్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**గజ్వేల్, మార్చి 6 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన గుజ్జేటి అశోక్ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చే సరికి మరణించినట్లు వైద్యులు తెలిపారు. బుధవారం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజ్ఞాపూర్‌కు చెందిన హిందూ యువత అశోక్ కుటుంబసభ్యులను ఓదార్చి రూ.20,850 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

### నేటి నుంచి భ్రమరాంబ మల్లికార్జునస్వామి

# మహా శివరాత్రి మహోత్సవాలు

**పెద్దఎత్తున ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ.. లక్షలాదిగా తరలి రానున్న భక్తులు**

**అమీన్‌పూర్, మార్చి 6 ప్రభాతవార్త:**

తెలంగాణలో ప్రసిద్ధ దేవాలయం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం మహా శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబైంది. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ఆరవ శతాబ్దంలో వెలిసిందని అర్చకులు చెబుతున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో బీరంగూడలో గల ఈ నెల 7వ తేదీ నుండి 11వ తేదీ వరకు నిర్వహించే శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి శివాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లతో ఆలయాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ కాంతులతో సుందరంగా తీర్చిదిద్దారు. శివరాత్రి సందర్భంగా శివాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, వైద్య సౌకర్యాలు, చలువ పందిళ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులకు పండ్లను పంపిణీ చేయనున్నారు. మహా శివరాత్రి పండుగకు భక్తుల రద్దీ విపరీతంగా ఉండే అవకాశం ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భారీ క్యూలైన్‌ల ఏర్పాటుతో పాటు బీరంగడూ కొండ పైకి వెళ్లే భక్తులకు మార్గం పనులు పూర్తి చేశారు. దేవాలయానికి వచ్చే వాహనాలకు కావలసిన పార్కింగ్ స్థలం కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల నుంచి భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సుమారు మూడు నుండి నాలుగు లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని నిర్వాహకులు తెలిపారు. గుట్టపైన ఆలయ ప్రదిక్షణ, గణపతి పూజ, నవగ్రహ దారణ పూర్వక అభిషేకం, మహా మండపం, ప్రత్యేక అభిషేకాలు, అగ్ని గుండాలు, అమ్మవారి సహస్ర కుంకుమార్చన, మహా శివరాత్రి లింగోద్భవ అభిషేకం, తెల్లవారు జామున రెండు గంటలకు మహన్యాస పూర్వ ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం, వసంతోత్సవం, బ్రహ్మ అలంకరణ, పల్లకి సేవ, పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, హోమం, పవళింపు సేవ ఉంటాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో భక్తుల సౌకర్యాల కోసం సీసీ కెమెరాలతో పాటు పోలీసు అధికారులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ సుధాకర్ యాదవ్, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శశిధర్‌లు తెలిపారు.

**పూజా కార్యక్రమాలు...**

ఈ నెల 7వ తేదీ గురువారం ఆలయ ప్రదిక్షణ, గణపతి పూజ నవగ్రహ ధారణ, మహన్యాస పూర్వక అభిషేకం, అమ్మవారికి సహస్ర కంకుమార్చన బిల్వర్చన, 8వ తేదీన శుక్రవారం మహా శివరాత్రి పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా మండపం నుంచి ప్రత్యేక అభిషేకాలు, నవగ్రహ హనుమాన్ పూజ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కంకుమార్చ, అగ్నిగుండాలు తొక్కడం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం

రుద్రాభిషేకం, శనివారం ఉదయం 8 గంటలకు రుద్రాభిషేకం, 10.45 నిమిషాలకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, సాయంత్రం రథోత్సవం, ఊరేగింపు, 10వ తేదీన ఆదివారం వసంతోత్సవం, సాయంత్రం శివనామ స్తోత్రం పారాయణం, భస్మలంకరణ, బిల్వర్చన, పల్లకి సేవ, 11వ తేదీన సోమవారం ఉదయం 7 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పూర్ణాహుతి, హోమం, సాయంత్రం, పవళింపు సేవా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

**భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి...**

**ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్**

మహా శివరాత్రి సందర్భంగా బీరంగుట్ట పైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయం, చలువ పందిళ్లు, వైద్య సౌకర్యాల ఏర్పాట్లు పూర్తి చేసాం. భక్తులకు పండ్లు పంపిణీ చేయడం జరుగుతుంది. భద్రత దృశ్య ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాం. భక్తులు పెద్దఎత్తున హాజరై మహోత్సవాలను విజయవంతం చేయాలి.

## నర్సాపూర్‌లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**నర్సాపూర్, మార్చి 6,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఫీజు లేకుండా ఎల్ఆర్ఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేస్తు బుదవారం నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి అధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబెద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తె 6 గ్యారంటీలను అమలు చేయడం తో పాటు జిరో ఎల్ఆర్ఎస్ ను కూడ అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాగా ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మాటలను అమలు చేయకుండా మాట మార్చిందని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎల్ఆర్ఎస్ పై లేని పోని ఆరోపణలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్ పై ఫీజు లు నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కింద 24 లక్షల 44 వేల మంది దరకాస్తు చేసుకున్నారని అన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద ఫీజు ప్రవేశ పెడితే 22 వేల కోట్ల బారం ప్రజల పై పడనుందన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్ఆర్ఎస్ ఫీజులు రద్దు చేయాలని లేకుంటే బిఆర్ఎస్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ లోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు బోగ చంద్రశేఖర్. నాయకులు సత్యంగౌడ్, సంతోష్‌రెడ్డి, కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభం

**నర్సాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:** రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వార రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదికలో బుదవారం నిర్వహించగా నర్సాపూర్ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండల్లాలో ఈ విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలను వీక్షించారు. ఈ మేరకు ఈ విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడియో కాన్ఫరెన్స్ ను తిలకించడం జరిగింది. ఈ విడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అనుభంద శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈమేరకు రైతులకు అధునాతన పద్ధతుల్లో సాగు చేయు విదానం, పంటల సస్యరక్షణ విదానాలు వంటివి తదితర ఆంశాలను ఎప్పటికప్పుడు ఈ విడియో ద్వార వివరించనున్నట్లు అధికారులు తెలిపారు. అంతేగాక ఈ విడియో కాన్ఫరెన్స్ ప్రతిరోజు సిఎం రేవంత్‌రెడ్డి వీక్షించస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, ఏడిఏ సంధ్యారాణి, ఏవో అనిల్‌కుమార్, ఎంపిటీసిలు ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్‌గుప్త, లక్ష్మి అశోక్, వివిద శాఖల అధికారులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళను మరిస్తే మనుగడే శూన్యం

**- షాద్‌నగర్ డిపోలో మహిళా దినోత్సవ వేడుకలు**

**- మహిళ కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేత**

**షాద్‌నగర్, మార్చి 6, (ప్రభాతవార్త) :**

సృష్టికి ప్రతిరూపమైన మహిళ లను మరిస్తే మనుగడే శూన్యమవుతుందని అనాదిగా ఎందరో మహ నుభావులు, కవులు స్త్రీ మూర్తి యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెపపుతునే ఉన్నారు. ఈనెల 8న మహిళాదినోత్సవం రోజునే మహా శివరాత్రి రావడంతో షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారమే మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. డిపో మేనేజర్ ఉష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి డీప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ విజయలక్ష్మీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రాంగణంలో మహిళ ప్రయాణీకులు, ఆర్టీసీ మహిళ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా డీప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ మాట్లాడుతూ... మహిళలు మారుతున్న కాలానికి అనుగు ణంగా అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. ఉన్నత శిఖరాలను అది రోహించిన మహిళలు తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచి వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు. అనంతరం మహిళ సిబ్బంది, కండాక్టర్ల కు డీపో మేనేజర్ ఉషతో కలిసి ప్రశంసా పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, మహిళ ప్రయాణీకులు తదితరులు పాల్గొన్నారు.

### బివిఆర్ఐటిలో అట్టహాసంగా ప్రారంభమైన

## జాతీయ స్థాయి విద్యుత్ వాహనాల పోటీలు

**నర్సాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి ఈబాజా విద్యుత్ వాహనాల పోటీలు హట్టహాసంగా బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ఈ నెల 6 నుండి 11 వ తేదీ వరకు ఆరు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ పోటీలకు దేశంలోని 80 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 2, 400 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్సర్మేషన్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్‌రంజన్ హాజరయ్యి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ బివిరాజు ఇంజనీరింగ్ కళాశాల, శ్రీవిష్ణు ఎడ్యుకేషన్ సొసైటీల అధ్వర్యంలో ఈ జాతీయస్థాయి ఈబాజా విద్యుత్‌వాహనాల పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈబాజా సైండియా 2024 సంవత్సరం 17 వ ఎడిషన్ విష్ణు మోటార్ స్పోర్ట్స్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ఈబాజా విబాగం ఇంజనీరింగ్ విధ్యార్థుల్లో సృజానాత్మకత, శ్రేష్టత ను పెంపొందించడమే లక్ష్యమని అన్నారు. అంతేగాక ఈ పోటీలు దక్షణ దేశంలో మొదటిదని ఆయన పేర్కొన్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఈబాజా విధ్యుత్ వాహనాల పోటీలకు దేశంలోని వివిద పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కాగా ఈపోటీల్లో ఆత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆయా పరిశ్రమల్లో ఉద్యోగఅవకాలు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రసిడెంట్ ఇంజనీర్ హిరో టాకిహార డే, వ్యాపార కేంద్రం టెక్నాలజీ రోనాల్డ్ నిసర్, బివిఆర్ఐటి కళాశాల డైరక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబే, ఇండస్ట్రీ డైరక్టర్ అఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్ సతీష్‌పరుచూరి, మేనేజర్ బాపిరాజు, ఏవోలు అశోక్‌రెడ్డి, సురేశ్ లు అన్నివిబాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**నర్సాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:** నర్సాపూర్‌లోని టిఎన్జీవోస్ భవన్‌లో బుధవారం టిఎస్ యుటిఎఫ్ అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. టిఎస్ యుటిఎఫ్ నర్సాపూర్ డివిజన్ జిల్లా కార్యదర్శి శ్రీ జ్యోతి, విశాలాక్షి ల అధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిఎస్‌యుటిఎఫ్ సీనియర్ నాయకురాలు ఇందిరా జ్యోతి హాజరయ్యారు. ఈ సందరక్బంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, పాఠశాలల్లో లింగవివక్షత లేకుండా చూడాలని, బాల బాలికలు సమానమన్న విషయాన్ని ఇంటి నుంచి మొదలు పెట్టి పాఠశాలల్లో ఉపాధ్యాయులు మన భాధ్యతగా నిర్వర్తించాలని అన్నారు. బాలికల విద్యను ప్రోత్సహించాలని బాలికలు అన్నిరంగాల్లో రాణిస్తారని తెలియజేశారు. మహిళా డాక్టర్ మాట్లాడుతూ మహిళల్లో, బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉన్నదని దానిని అరికట్టడానికి పోషకాహారాన్ని అందించాలని ఆమె తెలియజేవారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. శ్రీనివాస్‌రావు, పద్మారావు, రవి, రమేశ్‌రాజు, పద్మజ, అస్రా, డాక్య, వెంకటస్వామి, గంగాధర్, అప్పలనాయుడు, నీలమ్మ, ఈజిహెచ్ఎం లు వేదశ్రీ, నవీనజ్యోతి, రాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

**చౌడపూర్ మార్చి 6,ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని మందిపాల్ గ్రామ ఒంకారేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో ,వైభవంగా నిర్వహించే శివరాత్రి ఉత్సవాలు గురువారం నుండి ప్రారంభమతున్నాయని అర్చకులు రాజశేఖర్ తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ....గురువారం ఉదయం నుండి ఆలయ ప్రవేశం, అఖండ దీపారాధనలతో కార్యక్రమాలు మొదలవుతాయని, శుక్రవారం శివరాత్రి పర్వదినాన రుద్రాభిషేకం, లక్ష భిల్వార్చన, సాయంత్రం ఎదుర్కొళ్లు, ఉమామహేశ్వర స్వామి వారి కళ్యానోత్సవ కార్యక్రమాలు ఉంటాయని, శనివారం ఊరేగింపు, నంది కోల సేవ వంటి కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : ఇన్స్పెక్టర్

**షాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తానని షాబాద్ ఇన్స్పెక్టర్ బి.కాంతారెడ్డి అన్నారు. నార్సింగ్ ట్రాఫిక్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న బి.కాంతారెడ్డి బదిలీపై షాబాద్ పోలీస్ ఇన్స్పెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

### గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-మాజీ ఎఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**గజ్వేల్, మార్చి 6 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గంలో గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మంజూరుచేసిన ఆర్‌అండ్‌బి రోడ్లను క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకున్న రేవంత్ సర్కార్‌కు గజ్వేల్ ప్రజలు రాబోయే రోజుల్లో సరైన బుద్ది చెబుతారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్ళలో ఎన్నడూ లేనివిధంగా కెసిఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, వాటికి కొనసాగింపుగానే మంజూరైన కోట్లాది రూపాయల రోడ్లు, కమ్యూనిటీ భవనాలను రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం సరైందికాదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ ప్రాంత అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రేవంత్‌రెడ్డిపై పత్తిడి తీసుకువచ్చి గతంలో ఇచ్చిన అభివృద్ధి పనులు కొనసాగేవిధంగా చూడాలన్నారు. రాజకీయంగా బిఆర్ఎస్ పార్టీ, కెసిఆర్‌పై ఉండే అక్కసుతో గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిపై చూపడం హేయమైన చర్య అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వేలాది కోట్ల రూపాయలు కొడంగల్ నియోజకవర్గానికి కేటాయించినప్పుడు గజ్వేల్ నియోజకవర్గంలో గతంలోనే మంజూరైన పనులను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో గజ్వేల్ నియోజకవర్గంలో మంజూరైన 9.8 కోట్ల రూపాయలతో అహ్మదీపూర్-కొల్గూరు రోడ్డు, రూ.3 కోట్లతో మంజూరైన మీనాజిపేట-బస్వాపూర్ రోడ్డు, రూ.30 కోట్లతో మంజూరైన రాజీవ్‌రహదారి-ముట్రాజ్‌పల్లి మీదుగా గజ్వేల్ రోడ్డు, రూ.23 కోట్లతో మంజూరైన మర్కుక్-నారాయణపూర్ రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని, ఇప్పటికైనా ఇలాంటి కక్షసాధింపు చర్యలు మానుకొని వెంటనే తిరిగి రోడ్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలంతా ఏకమై ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందజేత

**వర్గల్, మార్చి 6 (ప్రభాతవార్త):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ చైర్మన్ బాబుగౌడ్ పేర్కొన్నారు. బుధవారం రోటరీ క్లబ్ సభ్యుడు బచ్చు అమర్ సహకారంతో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు బాగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. 10/10 సాధించిన 10 మంది విద్యార్థులకు రూ.50వేల పారితోషికం అందిస్తామని

గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమాశంకర్

## ధరణి సమస్యలు గ్రామసభల్లో పరిష్కారం : తహసీల్దార్

ముసిపల్లి, మార్చి 6, ప్రభాతవార్త: ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమా శంకర్ సూచించారు. బుధవారం మండలంలోని గౌడ్‌గామా, వాసర్ గ్రామాల్లో ధరణి గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి తహసీల్దార్ ఉమా శంకర్ మాట్లాడుతూ అందుబాటులో లేని రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## రాంపూర్ పాఠశాలలో స్వయం పాలన

రాంపూర్ పాఠశాలలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**అల్లాదుర్గం, మార్చి 6, ప్రభాతవార్త:** మండలంలోని రాంపూర్ గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులైన విద్యార్థులు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా పి శైలజ, డిఈఓగా మల్లేశ్వరి, మండల విద్యాధికారిగా శంకర్, ఉపాధ్యాయులుగా సుశాంత్, నందకిశోర్, ఆక్షయ్, వరుణ్, సందీప్ వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ చాటి ఉపాధ్యాయులైన విద్యార్థులను పాఠశాల బాధ్యులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.నాగ రాజు, ఉపాధ్యాయులు దుర్గప్రసాద్, ఝాన్సీ రాణి, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

## మనూర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు

మనూర్‌లో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న పట్లోళ్ల సంజీవరెడ్డి

**మనూర్, మార్చి 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడి కేంద్రం భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు జయశ్రీ మోహన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు సిద్దారెడ్డి, దిగంబర్‌రెడ్డి, శేరి రాజు, మాజీ సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు అశోక్, వైద్య అధికారి నర్సింగ్ చౌహాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలుచేయాలి : ఎమ్మెల్యే

అధికారికి వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి టౌన్, మార్చి 6, ప్రభాతవార్త:** ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి 20 వేల కోట్ల రూపాయలను దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ వద్దని, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ చేసిన హామీలను గుర్తు చేశారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచ డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ ఇప్పుడు వారు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తమకుమార్‌రెడ్డి స్పందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, దేశ్‌పాండే, నరహరిరెడ్డి, భీరయ్య యాదవ్, శివరాజ్ పాటిల్, ఆత్మకూర్ నగేష్, చింత గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు శక్తి స్వరూపులు : జిల్లా న్యాయమూర్తి

**సంగారెడ్డి టౌన్, మార్చి 6, ప్రభాతవార్త:** మహిళలు శక్తి స్వరూపులు అని జిల్లా న్యాయమూర్తి హనుమంతరావు అన్నారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానపోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ సహకారంలో సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్లలో పని చేస్తున్న గృహ కార్మికులకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళ లేనిదే సృష్టి లేదని గుర్తు చేశారు. న్యాయమూర్తి హనుమంతరావు మాట్లాడుతూ మహిళల రక్షణ కొరకు పలు చట్టాలు అమలులో ఉన్నాయని, మహిళలు చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మేడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ స్వప్న, పార్కర్ ఆర్డినేటర్ మహాజీల్, గృహ కార్మికులు 91 మంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన ధరఖాస్తులు స్వీకరణ

**అల్లాదుర్గం, మార్చి 6, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవ కేంద్రంలో ప్రజలు అందచేస్తున్న ధరఖాస్తులను ఎంపిడిఓ శంకర్ స్వీకరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మండల ప్రజలు గృహజ్యోతి, సబ్సిడీ సిలెండర్‌ల కొరకు అందచేస్తున్న ధరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఓ శంకర్ పేర్కొన్నారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 0 బిల్లు రాని వారు, గ్యాస్ నెంబర్ ఇవ్వని వారు ఆధార్ కార్డు, వైట్ రేషన్ కార్డు, కరెంటు బిల్లు, గ్యాస్ బుక్, ప్రజా పాలన ధరఖాస్తు రశీదు జిరాక్సు పత్రాలు, ఫోన్ నంబర్‌తో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజా పాలన ధరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపిడిఓ శంకర్

# తాగునీటి సమస్య రాకుండా చూడాలి

### మండల సభలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మాట్లాడుతున్న సంజీవరెడ్డి

**మనూర్, మార్చి 6, ప్రభాతవార్త:**

ఎండా కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారుల తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిమ్యాల్ గ్రామంలో తాగునీటి సమస్య వస్తుందని సభ దృష్టికి తేగా స్పందించిన ఎమ్మెల్యే మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మనూర్‌లో విద్యుత్ స్తంభాలు, వైరు కావాలని కార్యదర్శి సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ అశోక్‌రెడ్డి డిడిలు చెల్లించాలని సూచించగా ఎమ్మెల్యే జ్యోకం చేసుకుని గత పాలకులు వెంచర్లలో ప్రభుత్వ విద్యుత్ స్తంభాలు, వైర్లు వేసి ప్రజా ధనం వృధా చేశారని, పేదలకు ఇబ్బందులు కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మనూర్‌లో వెంటనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు, గ్రామాల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ హైమద్ హుసెన్, తహసీల్దార్ వెంకట స్వామి, వైద్య అధికారి నర్సింగ్ చౌహాన్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ హన్నాన్, అశోక్ రెడ్డి, ఎపిఎం వంశీకృష్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యమున, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ కింద ఉచితంగా భూములు క్రమబద్ధీకరించాలి : మాజీ ఎమ్మెల్యే

**హుస్నాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్‌ను తీసుకువస్తే ప్రభుత్వం ప్రజల రక్తం తాగుతోందని ఎద్దేవా చేయడంతో పాటు కోర్టులో కేసు వేసిన కాంగ్రెస్ వాళ్లే అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ పథకాన్ని మళ్లీ తీసుకువచ్చి ప్రజల నుండి డబ్బులు దండుకోవాలని చూడడం సిగ్గుచేటని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులతో కలసి ధర్నా నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ కింద ప్రజల భూములు ఉచితంగా క్రమబద్ధీకరించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదే విధంగా హుస్నాబాద్ పట్టణం నుండి వెళ్తున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారస్థులకు నష్టం జరగకుండా ఉండేందుకు 90 ఫీట్ల వెడల్పుతోనే రహదారి నిర్మింపజేసేలా ఈ ప్రాంత శాసనసభ్యులు,రాష్ట్ర మంత్రి పొన్న ం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మెన్ మారంపల్లి సుధీర్‌కుమార్,హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,వైస్ చైర్మెన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి,ఎంపిపి లకావత్ మానసనాయక్,పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్, మండల అధ్యక్షులు వంగ వెంకటరామిరెడ్డి,అక్కన్నపేట మండల అధ్యక్షులు పెనరు సాంబరాజు,మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ ఎడబోయిన రజినితిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వయం పాలనతో బాధ్యతలు తెలుస్తాయి

**సిద్ధిపేట అర్బన్, మార్చి 6, ప్రభాతవార్త :** స్వయం పాలనతోనే విద్యార్థులు తమ బాధ్యతలను గుర్తెరుగుతారని మండల మానిటరింగ్ అధికారి బి వెంకటేశం, విశ్రాంత డిప్యూటి డిఈవో పెద్ది వైకుఠంలు అన్నారు.సిద్దిపేట అర్బర్ మండలం నాంచార్‌పల్లి ప్రథమిక ఉన్నత పాఠశాలలో బుదవారం విద్యార్థులు స్వయం పాలనతో పాటు క్రమ శిక్షణ,సమయపాలనతదితర విషయాలను అనుభవ పూర్తిగా తెలుసుకునేందుకు స్వయంపాలన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌గా ప్రణీత్,డీఈవోగా అరవింద్,డిప్యూటీ డీఈవోగా అశ్వంత్, ఎంఈవోగా మైత్రి, హెచ్‌ఎంగా సిరి చందన, ఉపాధ్యాయులుగా పూజ, నందిత వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కౌన్సిలర్

**హుస్నాబాద్, మార్చి 6,ప్రభాతవార్త :** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ బోజు రమాదేవి రవిందర్ అన్నారు.బుధవారం రోజున పట్టణంలోని రెండవ వార్డులో ని ప్రజలకు తడి,పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బుట్టలు తీసుకున్న ప్రతీ ఇంట్లో మహిళలు తడి,పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ జయశంకర్,ఆర్పి శ్రీలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు

**హుస్నాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** మండలంలోని పందిల్ల గ్రామంలో నిర్మిస్తున్న మహాలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన తాటికొండ శోభారాణిప్రభాకర్‌రెడ్డి బుధవారం రూ 50వేల 1వంద 16 రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందించినట్లు ఆగ్రామ తాజా మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అంతే కాకుండా హుస్నాబాద్‌కు చెందిన చెన్నపు రాజుఈశ్వరిలు ఆలయ నిర్మాణానికి రూ 20వేల 16రూపాయలు అందజేయగా గ్రామంతో పాటు వివిధగ్రామాలకు చెందిన భక్తులు తోచిన కాడికి సహకరిస్తున్నారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూనే దాతలు ఇంకా ఎవరైనా ఉంటే తోచిన దేవాలయానికి తమకు తోచిన సహకారం అందించాలని కోరారు.

## డాకూరు రైతువేదికలో రైతు నేస్తం వీక్షించిన రైతులు

**జోగిపేట, మార్చి 6, ప్రభాతవార్త:** వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమాన్ని డాకూరు రైతు వేదికలో బుధవారం వ్యవసాయ అధికారులతో కలిసి రైతులు వీక్షించారు. ఇందులో ప్రధానంగా రైతులు పంటలపై పెట్టిన పెట్టుబడి నష్టపోకుండా ఉండేందుకు పంటబీమా చేయించాలని ముఖ్యమంత్రి సూచించారు. పంట లపై అవగాహన కల్పించటంతోపాటు పంటల దిగుబడులు పెంచాలనే ఉద్దేశంతో ఈ రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇందులో మండల ప్రత్యేక అధికారి గీత, ఏడిఏ అరుణ, ఏవో విజయరత్నలతోపాటు రైతులు పాల్గొన్నారు.



రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు

విజయం సాధించిన అంతరం బిఆర్‌టియూ యూనియన్ నేతలు

## పెన్నార్‌లో బిఆర్‌టియూ జయకేతనం

**పటాన్‌చెరు, మార్చి 6,ప్రభాతవార్త:** పెన్నార్ పరిశ్రమలో నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బిఆర్‌టియూ జయకేతనం ఎగుర వేసింది. వరుసగా రెండుసార్లు గెలిచి కార్మికుల విశ్వాసం నిలబెట్టుకుంది. బుధవారం నాడు పరిశ్రమలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో మొత్తం 508 ఓట్లకు గాను 507 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు ఓట్లు చెల్లక పోగా బిఆర్‌టీయూ సంఘానికి 282 ఓట్లు, సిఐటియూ ఐఎన్‌టియూసి ఐక్య కూటమికి 223 ఓట్లు పోలయ్యాయి. 59 ఓట్ల మెజార్టీతో బిఆర్‌టియూ వరుసగా రెండవసారి ఘన విజయం సాధించింది. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి మార్గదర్శకత్వంలో బిఆర్‌టియూ తరుపున తరుపున సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ అధ్యక్షుడిగా పోటిచేశారు. బిఆర్‌టీయూను పోటి ఓడించాలన్నా లక్ష్యంతో సిఐటియూ, ఐఎన్‌టి యూసి యూనియన్లు కూటమిగా పోటి చేసిన వారికి పరాజయం తప్పలేదు. ఈ సందర్భంగా పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి మట్లాడుతూ 40 సంవత్సరాలుగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు, వారి కష్టసుఖాల్లో అండగా నిలిచామని, గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కార్మికులకు తగు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. వరుసగా రెండుసార్లు బిఆర్‌టీయూ యూనియన్‌ను గెలిపించిన పెన్నార్ కార్మికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన ప్రతి హామిని అమలు చేస్తామన్నారు. బిఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో పెన్నార్ పరిశ్రమలో వరుసగా రెండవసారి బిఆర్‌టియూ యూనియన్ ఘన విజయం సాధించిందని, యూనియన్ విజయానికి సహకరించిన ప్రతి కార్మికుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మండలానికి చేరిన పదవ తరగతి ప్రశ్నా పత్రాలు

పదవ తరగతి ప్రశ్నా పత్రాలను భద్రపరుస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, మార్చి 6 ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు జరగనుండగా, అందుకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు బుధవారం మండలానికి చేరాయి. రూట్ అధికారి శివ్వంపేట ఎంఈవో బుచ్చయ్య నాయక్ ఆధ్వర్యంలో వెల్దుర్తి, కుకునూర్ సెంటర్‌లకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు రావడంతో వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో కుకునూర్ సీఎస్ సీతారామయ్య, వెల్దుర్తి సీఎస్ సాంబయ్యలు ఉన్నారు.

## మహిళా వికలాంగుల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి

### -ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షురాలు యశోద

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి6 ప్రభాతవార్త:** మహిళా వికలాంగుల రక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షురాలు కె. యశోద అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్‌లో ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా వికలాంగుల పట్ల వివక్షత, వేధింపులు కొనసాగుతున్నాయని అన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. మహిళా వికలాంగులకు న్యాయం, ఉపాధి కోసం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా వికలాంగుల సాధికారత కోసం ఉద్యమాలు చేస్తామని అన్నారు. మార్చి 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతున్న మహిళా వికలాంగుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని అన్నారు.

**ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం మెదక్ జిల్లా కన్వీనర్‌గా స్వరూప ఎన్నిక..**

బుధవారం జరిగిన మహిళా వికలాంగుల సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం మెదక్ జిల్లా కన్వీనర్‌గా స్వరూప ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా యశోద, దుర్గ, వెంకటమ్మ, కేశమ్మ, చంద్రమ్మ, కవిత, యాదమ్మలు ఎన్నికయ్యారు.

సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి భూమిపూజచేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## సిర్గాపూర్‌లో సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శ్రీకారం

**సిర్గాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి భూమి పూజ నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మనీష్ పాటిల్, మాజీ సర్పంచ్ స్వప్న శంకరయ్య స్వామి, ఎంపిటిసి సభ్యులు పీరప్ప, మహేశ్వర్ సేట్, శ్రీనివాస్‌రావు, వైద్య అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మేదపల్లిలో విద్యార్థుల స్వయం పరిపాలన

మేదపల్లిలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**ఝరాసంగం, మార్చి 6, ప్రభాతవార్త:** మండలంలోని మేదపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్మఎట్టి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాలని, కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యను ఆర్జిస్తే ఉన్నత శిఖరాలకు చేరడం తథ్యమన్నారు. విద్యార్థులు పెద్దలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయేషా ఫర్హాత్, నిర్మల, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో రైతు నేస్తంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**సిర్గాపూర్, మార్చి 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయం పట్ల రైతులకు సూచనలు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన దృశ్య శ్రావణంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఏడిఏ నూతనకుమార్, ఏఈఓ శశాంక్, ఎంపిపి అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తాం

### -పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి

మాట్లాడుతున్న పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి

**గజ్వేల్, మార్చి 6 (ప్రభాతవార్త):** మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎర్రవల్లి, సింగారం, ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత జీరో బిల్లును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయిని యాదగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటారన్నారు. ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వంలో త్వరితగతిన పరిష్కరించే విధంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి అందేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన వెంట సింగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నల్ల శ్రీధర్, మామిడి కృష్ణ, క్యాసారం బాబా, మల్లారెడ్డి, శ్రావణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డి, పంగ ప్రశాంత్, కిరణ్‌కుమార్, జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం : మాజీ ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, మార్చి 6,ప్రభాతవార్త:** కార్యకర్తలకు పార్టీ ఎలాంటి సమయాల్లో అయినా అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో నీటి శుద్ధి యంత్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గృహ జ్యోతి పథకాన్ని ప్రతి ఒక్కరికి వర్తింప చేయాలన్నారు. మహాలక్ష్మీ పథకం ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం బస్సుల సంఖ్యను తగ్గించి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారని చెప్పుకోవడం సరికాదన్నారు. బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం గవ్వలపల్లికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త భూపాలకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.2లక్షల రుపాయల భీమా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పట్లోరి మాధవి, బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యంగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, లాలు, ఉదయ్ ఉన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు పతకాల పంట

**పటాన్‌చెరు, మార్చి 6,ప్రభాతవార్త:** హైదరబాద్ ఎల్బీనగర్, సరూర్ నగర్, ఇండోర్ స్టేడియంలో న్యూ డ్రాగన్ ఫైటర్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో 2024కరాటే మాస్టర్ బి నరేష్ ఆధ్వర్యంలో గండి మైసమ్మ గాగిల్లాపూర్ నుండి 20 మంది విద్యార్థులు పాల్గోనగా గండి మైసమ్మ గాగిల్లా పూర్ నుండి 12 మందికి మొదటి స్థానం, 5గురికి రెండవ స్థానం, ముగ్గురు త్రోట్ ప్లేస్ మెడల్స్ స్థానాన్ని సాధించారు. టీం ఛాంపీయన్‌షిప్ సాధించారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ సీఐ శంకరయ్య,ఎస్ఐ రాజేష్,శేఖర్, రామ్మోహన్, ఈశ్వర్,కుమారస్వామి, విద్యార్థులకు మెడల్స్ వేసి, సర్టిఫికెట్స్ అందించారు. విద్యార్థులను సిఐ శంకరయ్య అభినందించారు.

## తొలగిస్తున్న తాటిచెట్లకు నష్టపరిహారం అందించాలి

### తహసీల్దార్, ఎక్సైజ్ సిఐలకు గీత పారిశ్రామిక సంఘం వినతి

**హు